

గిరిజనుల సమస్యలను వింటున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు

● గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి

ఉట్నూర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. జైనూర్ మండలం జంగాప్ గ్రామానికి చెందిన తొడసం ధనరాజ్ తనకు ఆర్థిక సహాయం మంజూరు చేయాలని, లింగాపూర్ మండలం పిక్లతండా గ్రామానికి చెందిన శశికాంత్ తనకు లాప్‌ట్యాప్ ఇప్పించమని, నార్నూర్ మండలం తడిహత్నూర్ గ్రామానికి చెందిన విద్యరాణి తనకు బోర్‌వెల్ మంజూరు చేయాలని, దస్తూరాబాద్ మండలం భుక్తాపూర్ గ్రామానికి చెందిన అనసూయ ఏఎన్‌ఎం ఉద్యోగం ఇప్పించమని దరఖాస్తులు సమర్పించారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో(పీవీటీజీ) మేస్రం మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఏడీఎంహెచ్‌వో కుడిమెత మనోహర్, ఏవో దామోదరస్వామి, మనోహర్, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు ఇప్పించాలి'

ఉట్నూర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఐటీడీ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పని చేస్తున్న దినసరి ఉద్యోగుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని గిరిజన సంక్షేమం నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. కాగా, జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్, ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు కెటీసీ నారాయణ, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిసి వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని, దినసరి ఉద్యోగులకు కావాల్సిన వేతనాల బడ్జెట్‌ను మంజూరు చేసి వేతనాలు ఇవ్వాలన్నారు.

నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 10 నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికేట్స్, ఫోటోలు, ఆధార్‌కార్డు తమ వెంట తీసుకుని రావాలని కోరారు. ఇందులో బీఏ(హెచ్‌ఈసీ), బీకాం(సీఏ), ఎంపీసీఎస్ డాటా సైన్స్, బీజెడ్‌సీ గ్రూపులలో గిరిజన విద్యార్థులకు సీట్లు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రారంభమైన డీసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

మావల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): డీసెట్-2025 సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో సోమవారం ప్రారంభమైంది. డీసెట్ ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మొదటి రోజు 850 మందికి గాను 580 హాజరయ్యారు. ఈ వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెల 13 వరకు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి తెలిపారు. ఇందులో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోలా కిరణ్, అధ్యాపకులు ఉమాకాంత్, రాజేశ్వర్‌రెడ్డి, విజయలక్ష్మీ, శివకుమార్, గంగామణి, ప్రియాంక, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇళ్ల మంజూరు

ఉట్నూర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అర్హులైన ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం మండలంలోని నర్సాపూర్(బి) గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసాపూర్(బి) గ్రామ పంచాయతీ పరిధిలోని 12 గ్రామాల పేద ప్రజలకు 40 ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఉట్నూర్ ప్రాంతానికి 12836 గృహాలు మంజూరు అయ్యాయని, వాటి నుంచి అర్హులైన గిరిజనులకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఇండ్లు రాలేదని ఎవరు కూడా అసంతృప్తికి గురికావోద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెందూరు కళావతిబండు, మాజీ ఎంపీపీ రాము తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల విక్రయ కేంద్రాల తనిఖీ

ఉట్నూర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని విత్తనాలు ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేయడం జరుగుతుందని ఉట్నూర్ మండల వ్యవసాయ అధికారి గిత్తే రమేష్ తెలిపారు. సోమవారం మండలంలోని షాంపూర్, ఎక్స్‌రోడ్డు, ఉట్నూర్‌లలో ఉన్న విత్తన, ఎరువుల విక్రయ కేంద్రాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేయడం జరిగిందన్నారు. నాసిరకం విత్తనాలు అమ్మకుండా రైతులకు మేలు రకం విత్తనాలు విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్ బృందాలు సైతం తనిఖీ చేస్తున్నాయని, ఎవరైనా నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు ఎరువులకు రషీదులు తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. రైతులు సైతం తాము కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు రషీదులు పొందాలని ఈ సందరంగా పేర్కొన్నారు.

'అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలి'

నేరడిగొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండల పరిధిలోగల అన్ని గ్రామ పంచాయతీలలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు రమణ, జనరల్ సెక్రటరీ గన్నంటి అమృత్ కుమార్‌లు అన్నారు. సోమవారం ఎంపీడీవో రాజ్‌వీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ కమిటీల్లో అసలైన లబ్ధిదారులను మరిచి తమ అనుయాయులకు అందించారని ఆరోపించారు. మరోసారి సభ ఏర్పాటు చేసి అర్హులను గుర్తించాలన్నారు.

ఇచ్చోడ మండల కేంద్రంలో అధ్వానంగా మారి కనిపిస్తున్న పారిశుధ్యం



అంతా కంపు.. కంపే!

- జిల్లాలో వానాకాలం సీజన్ ప్రారంభమైనా.. కనిపించని 'స్పెషల్ డ్రైవ్' కార్యక్రమాలు
- పట్టణంతో పాటు గ్రామాల్లో రోజురోజుకూ అధ్వానంగా మారుతున్న పారిశుధ్యం
- డీఎస్ఆర్ యాప్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు
- సీజనల్ వ్యాధుల బారిన పడి మంచం పడుతున్న జనం
- ప్రత్యేకాధికారుల పాలనలో పట్టుతప్పుతున్న ప్రగతి

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తాం

: రమేష్, డీపీవో, ఆదిలాబాద్

వర్షాకాలం సీజన్ ప్రారంభంకావడంతో గ్రామ, మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేస్తున్నాం. త్వరలోనే పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తాం. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం జరిగింది. పారిశుధ్యంపై ప్రణాళికాబద్ధంగా పని చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించాం. పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు. గ్రామాల్లో నిరంతరంగా చెత్తా సేకరణ జరుగుతుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటు న్నాం. పంచాయతీ కార్యదర్శులు నిత్యం గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుంది.



ఆదిలాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. బల్దియాతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వాహణ సక్రమంగా లేక పోవడంతో చెత్తాచెదారం పేరుకు పోతోంది. గత వారం రోజుల క్రితం జిల్లాలో ఓ మోస్తారు స్థాయి నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా.. అధికారులు ఇంకా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించక పోవడంతో పల్లె, పట్టణం అంతా కంపు కంపుగా మారి కనిపిస్తోంది. ప్రతి యేటా జూన్ మాసాన్ని మలేరియా మాసంగా పరిగణిస్తూ వైద్య ఆరోగ్య శాఖ అవసరమైన చర్యలు చేపడుతుంది. కానీ ఇప్పటి వరకు సీజనల్ వ్యాధుల ముప్పుపై అధికార యంత్రాంగం చర్యలు చేపట్టినట్లే కనిపించడం లేదంటున్నారు. శుక్రవారం పారిశుధ్యంపై అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ రాజర్షిషా సమీక్షా సమావేశాన్ని నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకోవడంతో సీజనల్ వ్యాధుల వ్యాప్తికి అవకాశం ఉందంటున్నారు. జిల్లాలో మున్సిపల్ పరిధిలోని 49 వార్డులు, అలాగే 473 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణపై అసలు పట్టింపే లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాలలో పరిస్థితులు మరీ దారుణంగా కనిపిస్తున్నా యి. అసలే వర్షాకాలం కావడంతో తాగునీరు కలుషితమై టైఫాయిడ్, డయేరియా, వాంతులు, విరేచనాలు, విష జ్వరాలు లాంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తికి అవకాశం ఉంటుంది. అయితే అధికార యంత్రాంగం అప్రమత్తమై పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకదృష్టిని సారిస్తేనే సీజనల్ వ్యాధుల ముప్పుకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందంటున్నారు.

నిధుల కటకట

మున్సిపాలిటి పరిధిలో పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టేందుకు నిధుల కొరత లేకపోయినా.. గ్రామ పంచాయతీలోనే నిధుల కటకట వెంటాడుతుందన్న ప్రచారం జరుగుతుంది. దీంతో పారిశుధ్య పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. మురికి నీటికాల్వల్లో భారీగా పూడిక పెరిగిపోయినా.. తొలగించేందుకు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీలో ఇద్దరి నుంచి 8 మంది వరకు మల్టీపర్పస్ వర్కర్లు పని చేస్తున్నారు. అయితే సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేందుకు ట్రాక్టర్‌ల సహాయం తప్పనిసరిగా మారింది. పంచాయతీల్లో నిధులు లేక డీజిల్ ఖర్చులకు కూడా ఇబ్బందికరంగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. చాలా గ్రామాలలో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించకుండానే రోడ్డుకు ఇరువైపుల ఖాళీ స్థలాల్లో నిర్లక్ష్యంగా పారవేయడంతో పల్లె పరిసర ప్రాంతాలు అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. చెత్త సేకరణకు ట్రాక్టర్‌తో పాటు ట్రాలీ, మల్టీపర్పస్ వర్కర్లను ప్రభుత్వం అందుబాటులో ఉంచినా.. పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో పల్లెల్లో ఎటు చూసిన చెత్తాచెదారమే కనిపిస్తోంది.

చేతులెత్తేస్తున్న కార్యదర్శులు

పల్లెల్లో పారిశుధ్యాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నా.. పంచాయతీ కార్యదర్శులు మాత్రం చేతులెత్తేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ డైలీ శానిటేషన్ రిపోర్టు (డీఎస్ఆర్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినా.. పంచాయతీ కార్యదర్శులు దీనిని తీవ్రంగా వ్యవతిరేకిస్తున్నారు. ఎందుకంటే ముఖం స్కానింగ్ ద్వారా నిత్యం నిర్వహించే శానిటేషన్ పనులను ఈ యాప్‌లో ప్రత్యేకంగా నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో ఇబ్బందులు తప్పవన్న ఉద్దేశంతో పంచాయతీ కార్యదర్శులు డీఎస్ఆర్ యాప్ ద్వారా విధులను నిర్వహించేందుకు ఆసక్తి చూపడం లేదంటున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో డీఎస్ఆర్ యాప్ వద్దంటూ ఎంపీడీవోలకు వినతి పత్రాలను అందించిన దాఖాలు ఉన్నాయి. ఇతర విధులతో పనిభారం పెరిగి పోతోందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. అన్నిరకాల సర్వేలు, విధులను నిర్వహిస్తూ.. పారిశుధ్యంపై

(తరువాయి 6వ పేజీలో...)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

స్పందించారు.. చెత్తను తొలగించారు!

ఇచ్చోడ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): 'ఇచ్చోడ ప్రజలకు చెత్త కష్టాలు' అనే శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా మండలకేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల సమీపంలో చెల్లచెదారుగా పడి ఉన్న చెత్తను సోమవారం ఉదయం తొలగించారు. అంతేకాకుండా కాలనీల్లో, రోడ్లపై చెత్తను ఎక్కడపడితే అక్కడ ఇష్టారీతిన పారబోస్తే జరిమానాలు విధిస్తామని గ్రామ పంచాయతీ ఈవో సురేష్ పేర్కొన్నారు. ఇక నుంచి కాలనీల్లోకి నిత్యం ఉదయం చెత్త సేకరణ వాహనాలు వస్తాయని, వాహనంలోనే చెత్త వేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. రోడ్లపై, మలుపుల వద్ద చెత్త వేస్తే జరిమానా విధిస్తామన్నారు.



చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న పంచాయతీ సిబ్బంది



చెత్తను తొలగించిన అనంతరం ఇలా..

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ శ్యామలా దేవి ● కలెక్టర్ సమావేశ మందిరంలో 'ప్రజా ఫిర్యాదుల విభాగం' ● పాల్గొన్న ఆయా శాఖల అధికారులు



అర్జీదారుల సమస్యలను వింటున్న అదనపు కలెక్టర్ శ్యామలా దేవి



ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చిన అర్జీదారులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలదేవి మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో ఇచ్చే అర్జీల పై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కార మార్గాలను అన్వేశించాలని సూచించారు. అలసత్వం వహిస్తే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల కోసం మున్సిపల్ శాఖ తరఫున కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. లబ్దిదారుల నుంచి ఇందిరమ్మ ఇండ్ల పై దరఖాస్తులను స్వీకరించడంతో పాటు వారికి ఉన్న సందేహాలను సిబ్బంది నివృత్తి చేశారు.

● 12 నుంచి ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం

ఆదిలాబాద్ అర్బన్: బాల కౌమార కార్మికుల రక్షణ పునరావాసంపై జిల్లా చైల్డ్ ప్రోటక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మికులు వ్యతిరేక దినోత్సవం ఈ నెల 12న నిర్వహించుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 12న జరుపుకుంటారన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) ఈ దినోత్సవాన్ని బాల కార్మికుల సమస్యపై అవగాహన కల్పిస్తూ దాని నిర్మూలనకు కృషి చేయడానికి ప్రారంభించిందన్నారు. పిల్లలను దోపిడీ నుంచి రక్షించడం, బాలల హక్కులను కాపాడడం జిల్లాలో బాల కార్మికులను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. బాల కార్మికుల సమస్యపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావడానికి సహాయపడుతుందని తెలిపారు. బాలల హక్కులను కాపాడడానికి వారి భవిష్యత్తును నిర్మించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఈ వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ మిల్కా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు

ఫిర్యాదుదారులతో బాధ్యతగా వ్యవహరించాలి

● 'ఫిర్యాదుల విభాగం'లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో జిల్లా ఎస్పీ అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసకున్నారు. అర్జీదారుల సమస్యలు విన్న జిల్లా ఎస్పీ వెంటనే సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై నేరుగా సమాచారం అందించాలంటే 8712659973కి వాట్సాప్ ద్వారా సంప్రదించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్‌కవిత, వామన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పదోన్నతితో బాధ్యతలు మరింత అధికం

ఆదిలాబాద్ అర్బన్: పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయని, కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ జిల్లా పోలీసు కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ఎస్సై నుంచి సీఐగా పదోన్నతి పొందిన ఇద్దరు మహిళ అధికారులు జె.అంజమ్మ, డి.పద్మ మహిళా అధికారులకు ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఇందులో సీసీ కొండ రాజు, సిబ్బంది జైస్వాల్ కవిత, వామన్, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లాలో ఈదురు గాలుల బీభత్సం

- జిల్లా కేంద్రంలో విరిగి పడిన చెట్లు ట్రాఫిక్ జామ్.
- విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం
- గాలివాన బీభత్సంతో అంతా అతలాకుతలం
- ఎంపీ గోడం నగేష్‌కు తప్పిన ప్రమాదం
- భీంపూర్ మండలం తాంసి(కే)లో పిడుగుపాటు

వివరాలు 7వ పేజీలో...



● కుప్పకూలిన స్టేజీ



● వెనుదిరిగి వెళ్లిపోతున్న ఎంపీ గోడం నగేష్



● విరిగిపడిన చెట్లు



● పరుగులు తీస్తున్న క్రీడాకారులు

'రైతుల వద్ద ట్రాక్టర్లను లీజుకు తీసుకుని అమ్ముతున్న వ్యక్తులపై చర్యలు'

ఉట్నూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వ సహాయంతో ట్రాక్టర్లను అందజేయడం జరిగిందని అమాయక రైతులకు మాయమాటలు చెప్పి మోసగించి ఇచ్చిన ట్రాక్టర్లను లీజు, అద్దెపేరుతో తీసుకొని వాటిని ఇంకొక వ్యక్తులకు అమ్ముతు మోసం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇదివరకే ఇంద్రవెల్లి పోలీసు స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 54/25తో కేసు నమోదు చేసి విచారణ జరుగుతుందని, ఇలాంటి నేరాలు జిల్లాలో మరిన్ని జరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలన్నారు.

'గిరిజనులకు బిల్లులు ఇవ్వడం లేదు'

ఉట్నూర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రధాని జన్మన్ పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని కోలాంతోటి గిరిజనుల కోసం కేంద్రప్రభుత్వం ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న గిరిజనులకు సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదంటూ ఆదిమ గిరిజనులైన కోలాం, తోటి గిరిజనులు సోమవారం ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ పీవీటీజీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ ఆత్రం ముకుందరావు మాట్లాడుతూ సీసీడీపీ పథకం ద్వారా 2023-24 సంవత్సరంలో మంజూరు అయినా నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. జేఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థను రద్దు చేసి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి పూర్తి స్థాయి అధికారాలు ఇవ్వాలన్నారు. ఈ ధర్నాలో మడావి మాణిక్‌రావు, మేస్రం జైరాం, టేకంవసంత్ రావు, కొడప రాదాబాయి, కుడిమెత తిరుపతి, ఆత్రం భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

బోథ్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన ఇందిరా మహిళ నిర్మాణానికి సోమవారం భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు ఇందిర మహిళల లబ్ధిదారుల మంజూరు పత్రాలను గ్రామ కార్యదర్శి పి.అంజయ్య అందజేయడంతో ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధి అందరితో కలిసి భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎలుక రాజు రాజశేఖర్, ఉమేష్ మహిళా సభ్యురాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వాలు ప్రకారం వేగవంతంగా ఉందని పూర్తి చేసుకోవాలని కమిటీ సభ్యులు సూచించారు. దశలవారీగా నిధులు మంజూరు అవుతాయని లబ్ధిదారులకు వివరించారు.

'పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఈనెల 12నుంచి పాఠశాలలు పున: ప్రారంభం కానున్నాయని,మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు కలెక్టరేట్ ఎదుట సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అధికారులు, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు మాట్లాడారు. డుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 12 నెలలకు సంబంధించి కోడి గుడ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేంద్రం ఇచ్చే రూ.వెయ్యి, రాష్ట్రం ఇచ్చే రూ.రెండు వేల వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఎండీఎం కార్మికులు శ్రీదేవి, రాంబాయి, లక్ష్మి, ఉశ తదితరులున్నారు.

గోదాంలో భారీగా మంటలు

ఆదిలాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ గోదాంలో సోమవారం సాయంత్రం భారీ మంటలు చెలరేగాయి. స్థానికుల వివరాల ప్రకారం రైల్వే గేట్ సమీపంలోని స్వస్తిక్ జిన్నింగ్ లో ఏర్పాటు చేసిన ఇవ్వాలిసి మంటలు చెలరేగాయి. ఒకేసారి గాలి దుమారం రావడంతో మంటలు భారీ స్థాయిలో చెలరేగాయి. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా వెంటనే వారు ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా, అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పొచ్చెరలో అడెల్లు అంతిమయాత్ర

● భారీ సంఖ్యలో అంతిమయాత్రకు హాజరైన జనం



అంతిమయాత్రలో పాల్గొన్న జనం

బోథ్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్టు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ అంతిమయా త్ర సోమవారం మండలంలోని పొచ్చెర గ్రామంలో నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ఊరేగింపుగా ప్రారంభించి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతిమయాత్ర కొనసాగింది. వివిధ సంఘాల వారు ఎర్రజెండాలు చేతబట్టి ముందుకు కదిలారు. ఈ సందర్భంగా పలువురు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాదాపు నాలుగు గంటల పాటు సాగిన శవయాత్రలో విప్లవ సంఘం వారు అమరుల త్యాగాలను కొనియాడుతూ విప్లవ గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. అనంతరం గ్రామం పరిసరాలలోని శ్మశాన వాటికలో అంతిమ దహన కార్యక్రమాలను చేపట్టారు. అంతకుముందు పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు టి.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం మావోయిస్టులను చంపాలన్న దుర్మార్గ పూరితమైన ఆలోచనతో వెళుతోందన్నారు. ఎన్‌కౌంటర్లన్నీ కట్టు కదలని, పట్టుకొని కాల్చి ఎదురుకాల్పుల్లో మరణించారంటూ ప్రచారం చేస్తోందన్నారు. అడెల్లు ఆశయ సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అంతిమ యాత్రకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి విప్లవ పార్టీల నాయకులు, మాజీ నక్సల్స్, పౌర హక్కుల సంఘం నాయకులు, ఎమ్మార్పీఎస్ తుడుందెబ్బ సంఘాల వారితో పాటు కుల బాంధవులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

● భారీ సంఖ్యలో హాజరై నివాళులర్పించిన సంఘాలు

మైలారపు అడెల్లు దహన సంస్కారాలను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించగా.. విప్లవ రచయితల సంఘం, పౌర హక్కుల సంఘం, అమరులైన మావోయిస్టుల కుటుంబాల సంఘం, తుడుందెబ్బ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా విప్లవ సంఘాల నాయకులు పద్మ కుమారి, పౌర హక్కుల సంఘం నాయకులు నారాయణ, ఆత్రం భుజంగరావు, డాక్టర్ రవీంద్ర ప్రసాద్, మాజీ నక్సల్స్ అనిల్, జ్యోతి, మురళి, లింగన్న అజయ్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకురాలు అనసూయ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి. చంటి, బీఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుల శ్రీనివాస్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కుడాల స్వామి కారం రవి, సిపిఐ నాయకులు ముడుపు ప్రభాకర్ రెడ్డితో పాటు మాజీ మావోయిస్టు నాయకులు సత్వాజి శ్రీకాంత్ తదితరులు హాజరై నివాళులర్పించారు. జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో మాజీ దళ నాయకులు సభ్యులు హాజరయ్యారు.

● సివిల్ డ్రెస్‌లో పోలీసులు !!

కాగా, అడెల్లు అంతిమయాత్ర జరుగుతున్నంతసేపు కార్యక్రమాన్ని ఫొటోలు, వీడియోలు తీస్తూ సివిల్ డ్రెస్‌లో పోలీసులు కదిలారు. ఆదివారం రాత్రి నుంచి స్థానిక ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలోనే ఉండిపోయారు. అంతేగాక ఎస్పీ ఇంటలిజెన్స్ పోలీస్ అధికారులు కార్యక్రమాన్ని డేగ కళ్లతో పరిశీలించారు. అంతిమయాత్ర పూర్తి కాగానే వెళ్లిపోయారు.

'ఆపరేషన్ కారిడార్‌ను నిలిపివేయాలి'

బోథ్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం నెలకొనే విధంగా చూడాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ నాయకుడు కేసీఆర్ మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరిపి శాంతియుత వాతావరణం కల్పించాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వాలు శాంతియుత వాతావరణం కల్పించకుండా ఆపరేషన్ కారిడార్ పేరుతో అడవులను జల్లెడ పడుతూ మావోయిస్టుల హత్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. పేద ప్రజల కోసం పోరాడుతున్న వారిని పట్టుకుని కాల్చి చంపుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీరును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. 20 సంవత్సరాల పాటు పేద ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేసిన అడెల్లు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటాడని పేర్కొన్నారు.

గ్రామాలలో బడిబాట ర్యాలీలు

ఉట్నూర్, జూన్ 9(అంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం బడిబాట ర్యాలీలు నిర్వహించారు. మండలంలోనిఉట్నూర్, లక్కారం, షాంపూర్, దంతనపల్లి, బీర్సాయిపేట్, గోండు కొత్తగూడ, కొత్తగూడ, గంగన్నపేట, గంగాపూర్ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులతో బడిబాట ర్యాలీలు నిర్వహించి కొత్త విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రాపల్లి ఆశన్న లక్కారం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థుల ఉపాధ్యాయుల బడిబాట ర్యాలీలో పాల్గొన్నారు. కొత్తగా ఐదుగురు విద్యార్థులకు లక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలు కల్పించడం జరిగిందని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీలు నిర్వహించారని తెలిపారు. లక్కారంలో జరిగిన ర్యాలీలో ఉపాధ్యాయులు మూడు శామ్యూల్, అక్కల రవిచంద్రగౌడ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

నేరడిగొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బోథ్ మండలం పొచ్చెర గ్రామానికి చెందిన లక్ష్మణ్ (32) మద్యానికి బానిసై సోమవారం మండలంలోని చించోలి గ్రామ సమీపంలో గల వాగులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత సంవత్సరం నుంచి లక్ష్మణ్ తాగుడికి బానిసై దొంగతనాలు చేసేవాడని కుటుంబీకులు తెలిపారు. కాగా ఆదివారం పక్కింట్లో 11 గ్రాముల బంగారం దొంగలించగా పట్టుబడడంతో పంచాయతీ నిర్వహించి గ్రామపెద్దలు మందలించారు. సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట కేశవపట్నం గ్రామస్థుల ధర్నా

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల పరిధిలోని కేశవపట్నం గ్రామంలో అసలైన అర్హులను విస్మరించి అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని గ్రామస్థులు ఆరోపించారు. సరైన సర్వే చేపట్టి అర్హులైన తమకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సోమవారం కేశవపట్నం గ్రామస్థులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

'ఆర్టీఐ బలోపేతానికి కృషి చేయాలి'

మావల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సామాన్యుడికి వజ్రాయుధముల సమాచార హక్కు చట్టం ఉంటుందని దానిని బలోపేతం చేయాల్సిన అవసరం ప్రతీ కార్యకర్తపై ఉందని సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ జిల్లా అధ్యక్షుడు వర్ని సంతోష్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండగుర్ల కమలాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యులు తాళ్ల రవీందర్, సత్యనారాయణ, అబ్రద్, తబ్రేజ్ ఖాన్, ధీరజ్ కుమార్, తదితరులులు ఉన్నారు.



తలమడుగు మండలం ఖోడద్ గ్రామ సమీపంలో రోడ్డుకిరువైపులా కనిపిస్తున్న పెంట కుప్పలు

అంతా కంపు.. కంపే!

(5వ పేజీ తరువాయి...)

ప్రత్యేకదృష్టిని సారించడం కష్టసాధ్యమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అప్పులు చేసి మరీ పారిశుధ్య పనులను చేపడుతున్న పరిస్థితులు ఉన్నాయని పేర్కొంటున్నారు.

ఈగల మోత.. దోమల బెడద

వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో పరిసర ప్రాంతాలు అధ్వానం గా మారి ఎటు చూసినా ఈగల మోతా, దోమల బెడదనే కనిపిస్తుంది. సక్రమంగా పారిశుధ్య నిర్వహణ చేపట్టక పోవడంతో పరిసరాలు కంపు కొడుతూ కనిపిస్తున్నాయి. జిల్లాలో మేజర్ గ్రామ పంచాయతీలైనా తలమడుగు, ఉట్నూర్, బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్, బేల, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాల్లో పారిశుధ్య నిర్వహణ మరీ అధ్వానంగా మారింది. ప్రస్తుతం పంచాయతీ పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలోనే పంచాయతీలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకాధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో అడిగే వారే కరువవుతున్నారు. అడపాదడప మండల కేంద్రాలకు వెళ్లి వస్తున్న ప్రత్యేక అధికారులు పల్లెల్లో పేరుకు పోతున్న పారిశుధ్య పనులను పట్టించుకోవడం లేదంటున్నారు. దీంతో పందులు, కుక్కల స్వైర విహారం పెరిగిపోయి దోమలు, ఈగల బెడద అధికమవుతుంది. అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యంతో మలేరి యా, డయేరియా, టైఫాయిడ్, డెంగ్యూ విష జ్వరాలకు కారణమవుతుంది. ఇప్పటికే ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులను నిర్మించిన వాటిని ఉపయోగంలోకి తీసుకు రాకపోవడంతో నిరుపయోగంగానే మారి కనిపిస్తున్నాయి.

భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

తలమడుగు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రారంభిన భూ భారత్ రెవెన్యూ సదస్సులతో దశాబ్దాల భూములకు సమస్యల పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. రెవెన్యూ సదస్సులో భాగంగా సోమవారం మండలంలో ఝరి, సాయిలింగి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం అధికారులు గ్రామాల్లోకి రావడంతో రైతులు వారి సమస్యలను అధికార దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. అదేవిధంగా ఈనెల 20 వరకు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

'రైతు భరోసా డబ్బులను విడుదల చేయాలి'

తలమడుగు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సాగు ప్రారంభమైనందున ప్రభుత్వం వెంటనే రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా డబ్బులు వెంటనే విడుదల చేయాలని సోమవారం మండల కేంద్రంలోని రైతులు అంబేడ్కర్ చౌరస్తా వద్ద సామూహికంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం కన్నా ఎక్కువ రైతు భరోసా అందిస్తానని హామీ ఇచ్చి మోసం చేసింది అన్నారు. మూడు నుంచి నాలుగు ఎకరాల లోపు రైతులక రైతు భరోసా ఖాతాలలో జమ అయ్యాయని, మిగతా రైతులకు ఏప్పుడు ఇస్తారని ప్రశ్నించారు.

27 ఏళ్లకు ఒక్కచోట చేరిన విద్యార్థులు

● ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

నిర్మల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని శ్రీ స్వామి వివేకానంద విద్యానికేతన్ పాఠశాల 1998-99 తొమ్మిది - పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 27 ఏళ్ల తర్వాత విద్యార్థులందరూ ఒక్కచోట చేరడంతో అప్పటి మధుర క్షణాలను ఒక్కసారి గుర్తు చేసుకున్నారు. బాల్యంలో వారు చేసిన అల్లర్లను ప్రస్తుతం వారంతా ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో ఉపాధ్యాయులకు వివరించారు. పట్టణంలోని కురన్నపేట్ మారుమూల వార్డులో ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా పాఠశాల స్థాపించి మంచి విద్యాబుద్ధులు అందించడంతో వారంతా వివిధ రంగాల్లో స్థిరపడ్డామని గురువులకు వివరించారు. విలువలతో కూడిన విద్యను అందించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేందర్, దేవేందర్, ఉపాధ్యాయులు మనోహర్, రవీందర్, తిరుపతి, సంతోష్, శ్రీనివాస్, విఠల్, తుకారాం, సునంద, రాధ, సురేఖ, తదితరులున్నారు.

సోన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో కార్యశాల

సోన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండల కేంద్రంలో భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలో కార్యశాల నిర్వహించడం జరిగింది. ముందుగా పార్టీ జెండాను మండల అధ్యక్షుడు ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ దళితమోర్చా జిల్లా అధ్యక్షులు రాచకొండ సాగర్ హాజరై మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్రమోదీ 11 సంవత్సరాల స్వపరిపాలన పూర్తయిన సందర్భంగా శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదానం దినోత్సవంతో పాటు యోగా దివస్, ఎమెర్జెన్సీ దివస్ అనే అంశాలపై సోన్ మండల కేంద్రంలో కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమాలు 15 రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు.

ప్రజావేదికతో సమస్యల పరిష్కారం

దిలావర్‌పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావేదిక ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ప్రజా వేదికలో ప్రతీ ప్రభుత్వ శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని అందువల్ల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు వీలు కలుగుతుందన్నారు. ప్రజలు ప్రజావేదికను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజా వేదికలో పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కరించలేదో వివరణ ఇవ్వాలని ఆయా శాఖల అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్, ఇరిగేషన్ ఏఈ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

అటవీసాగు భూములను గుంజుకోవడం ఆపాలి

నిర్మల్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అటవీసాగు భూములను గుంజుకోవడం ఆపాలి. మా భూమిని మాకు ఇవ్వాలని తర్లపాడ్ రైతులు బోసు భూమన్న కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగలి నర్సయ్య తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం సీనియర్ నాయకులు తాజా మాజీ సర్పంచ్ దుర్గం పోశలింగం, నాయకులు చింతకుంట శంకర్, పాల్గొన్నారు.



నిర్మల్ జిల్లా కేంద్రంలో శివాజీ విగ్రహం వద్ద నాయకులు



ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం

ఆనందోత్సాహాలతో నిర్మల్ జిల్లాలో ఛత్రపతి శివాజీ పట్టాభిషేకోత్సవం

నిర్మల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో సోమవారం ఛత్రపతి శివాజీ పట్టాభిషేక దినోత్సవాన్ని హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్ వద్ద శివాజీ సేవా సమితి వ్యవస్థాపకులు మేడిసెమ్మె రాజు శివాజీ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ అడుగుజాడలు అనుసరణీయమన్నారు. శివాజీ చూపిన ధైర్య సాహసాలు, పోరాట పటిమను అలవర్చు కోవాలన్నారు. బీజేపీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, ఎం. శంకర్‌రావు, డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, నూకల నందకుమార్, దిగంబర్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, అంజుకుమార్‌రెడ్డి, అలివేలు, కమల్ నయన్, సాయి, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ మహారాజ్ స్ఫూర్తితో హిందువులంతా సంఘటితం కావాలి

ఛత్రపతి శివాజీ మహారాజ్ 352వ పట్టాభిషేక వార్షికోత్సవ వేడుకలను సోమవారం నిర్మల్‌లో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శాస్త్రినగర్‌లో గల ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి నివాసంలో జరిగిన వేడుకల్లో పాకాల ఫౌండేషన్ చైర్మన్ రామచందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ... శివాజీ మహారాజ్‌కు పట్టాభిషేకం జరిగిన రోజు నాటి నుంచి నేటి వరకు హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. శివాజీకి పట్టాభిషేకం అంటే దేశంలోని హిందువులందరికీ పండుగలాంటిదన్నారు. అలాంటి పండుగను హిందువులంతా ఒక వేడుకగా జరుపుకోవాలన్నారు. శివాజీ మహారాజ్ లాంటి యోధుడిని స్ఫూర్తిగా తీసుకొని హిందువులంతా సంఘటితంగా ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా హిందూ యువత చెడు వ్యసనాల బారిన పడకుండా దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. అంతకుముందు ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన శివాజీ మహరాజ్ భారీ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

ఈ కార్యక్రమంలో దిలావర్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, అడెల్లి ఆలయ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌గౌడ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు అనుముల భాస్కర్, మాజీ సర్పంచ్ పి.రమేష్‌రెడ్డి, వినయ్, సుధాకర్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు

కుంటాల, జూన్, 9 : (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం సీజన్‌లో రైతులకు అవసరమ్యే పచ్చిరొట్టె ఎరువు విత్తనాలు కుంటాల సహకార సంఘం ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్నాయని చైర్మన్ సట్ల గజ్జారాం, సీఈవో నాగభూషణ్‌లు తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్ రకం యూరియా 450 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, పచ్చి రొట్టె ఎరువైనటువంటి జీలుగా బస్తా 25 కేజీలు రూ. 2137 ప్రస్తుతం 166 బస్తాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకవచ్చి వ్యవసాయాధికారులచే టోకెన్ పొంది తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల వినతి

తానూర్ , జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు సోమవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల జేఏసీ పిలుపు మేరకు తమ సమస్యలపై, ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులపై వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. అదే విధంగా గత పది రోజుల వ్యవధిలోనే విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన పంచాయతీ కార్యదర్శులకు నివాలులర్పించారు.

విద్యార్థికి న్యాయం చేయకపోతే ఆందోళనలు చేపడుతాం

భైంసా, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అంతర్ని గ్రామ పాఠశాల పైకప్పు కూలిన ఘటనలో సాయికుమార్ గాయాలయ్యాయి. కుటుంబానికి న్యాయం చేయాలని జనసేన ఉమ్మడి జిల్లా ప్రతినిధి సుంకెట మహేష్‌బాబు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామన్నారు.

కాల్వలో గోశాల నిర్మాణానికి భూమి పూజ

దిలావర్‌పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి లయం వద్ద గోశాల నిర్మాణానికి దేవస్థానం చైర్మన్ అంగూర్ మహేందర్ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ మాట్లాడుతూ... దాతల సహకారంతో గోశాల నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయం వద్ద గల సరైన షెడ్డు లేక ఆవులు, కోడెలు అవస్థలు పడుతున్నాయని చెప్పారు. భక్తుల సహకారంతో గో సంరక్షణ కోసం నిర్మిస్తున్న గోశాలతో నరసింహ క్షేత్రంలో మరింత ఆధ్యాత్మికత తోడవుతుందన్నారు. దిలావర్‌పూర్ ఎస్సై రవీందర్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో గోవుల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో భూమయ్య, ఆలయ అర్చకులు రాము, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సాయేందర్, వీడీసీ సభ్యులు నర్సారెడ్డి, నరేష్‌రెడ్డి, లోలం మాజీ సర్పంచ్ ఒడ్నం కృష్ణ దమ్మ మహేష్ శ్రీకాంత్, లక్ష్మీనర్సయ్య, పాలకవర్గ సభ్యులు సూర నవీన్, పూదరి శివ, వన్నెపన్ని శివ, గట్టు కాశీనాథ్, నర్సయ్య, జాదవ్ విఠల్, శ్రీకాంత్, లక్ష్మారెడ్డి, సాయి, గైని దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



గోశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం


కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



పిప్రి గ్రామంలో దరఖాస్తులు అందజేస్తున్న దృశ్యం

ముథోల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. అయితే సోమవారం మండలంలోని కారేగాం, బస్రి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈరెండు గ్రామాల్లోని రైతులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు రెవెన్యూ అధికారులకు అందజేశారు. పిప్రి గ్రామంలో 8 దరఖాస్తులు రాగా కారేగాం గ్రామంలో 22 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, నాయబ్ తహసీల్దార్ తెలంగ్‌రావు, ఆర్ఐ నారాయణపటేల్, సర్వేయర్ నరసింగ్ వీఆర్ఏలు, రికార్డ్ అసిస్టెంట్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

భూ భారతికి దరఖాస్తుల వెల్లువ



లక్ష్మణచాంద, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి రెవెన్యూ సదస్సుకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని మునిపెల్లి, న్యూ కంజర్ గ్రామాల్లో సోమవారం ఈ సదస్సును నిర్వహించారు. ఇప్పటి వరకు 460 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సరిత వెల్లడించారు. సమస్యల పరిష్కారం కోసం అత్యధికంగా దరఖాస్తులు వస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరితతో పాటు డిప్యూటీ తహసీల్దార్‌బాబు సింగ్, ఆర్ఐ నరేందర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, బెజ్జారం కిరణ్, దినకర్, గణేష్, రవి, అభిలాష్ రెడ్డి, రవీందర్, మమత, సాగర్, రాజేష్, రాజేందర్, రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి) మండలంలో 31 దరఖాస్తులు స్వీకరణ

నర్సాపూర్(జి), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నసీరాబాద్, తురాటి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు భూ సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచాయి. ఈ సదస్సులకు రెవెన్యూ అధికారులు హాజరై గ్రామస్థుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. తురాటి గ్రామంలో ఆరు దరఖాస్తులు రాగా, నసీరాబాద్ గ్రామంలో ఇరవై నాలుగు దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం కలిపి 31 దరఖాస్తులు స్వీకరించారు.

జూనియర్ కళాశాలలో పాఠ్య పుస్తకాల పంపిణీ

దిలావర్‌పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలను ప్రిన్సిపాల్ సుదర్శన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఏజీఎంసీ పి. ఆనందం, లైబ్రేరియన్ శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష

నిర్మల్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పిల్లలకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని వారు అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రెసిడెంట్ తే జేందర్ సింగ్ భాటియా, కొండాజి శ్రీకాంత్, చందుల స్వామి, ఊరే శ్రీకాంత్, మనీషా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఈదురు గాలుల బీభత్సానికి దుమ్ముతో నిండిపోయిన ఇందిరా ప్రియదర్శిని స్టేడియం



జిల్లా కేంద్రంలో విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న అధికారులు



ఉమ్మడి జిల్లాలో

ఈదురు గాలుల బీభత్సం

● ఆదిలాబాద్‌లో విరిగి పడిన చెట్లు, ట్రాఫిక్ జామ్ ● విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం



కార్యక్రమం నుంచి వెళ్లిపోతున్న ఎంపీ నగేష్

ఆదిలాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ఉక్క పోతతో ఉక్కిరి బిక్కిరి అయిన జనం సాయంత్రం సమయంలో ఒకేసారి ఆకాశం మేఘావృతమైంది. భారీ ఈదురు గాలులతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అలాగే జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహిస్తున్న సబ్ జూనియర్ పోటీలను నిర్వాహకులు అర్ధాంతరంగానే నిలిపి వేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎంపీ గోడం నగేష్ కార్యక్రమంలో పాల్గొనకుండానే వెనుదిరిగారు. రోడ్లపై చెట్లు విరిగిపడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరోవైపు భారీ వర్షం నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై నుంచి చెట్ల కొమ్మలను తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రయత్నాలు చేశారు. విద్యుత్ సరఫరాను తిరిగి పునరుద్ధరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేశారు.

నిర్మల్ జిల్లాలో కూలిన చెట్టు.. ఆటోకు తప్పిన ప్రమాదం

నిర్మల్: నిర్మల్ జిల్లాలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములతో కూడిన గాలి దుమారం జనాన్ని భయభ్రాంతులకు గురిచేసింది. దీంతో పాటు భారీ వర్షం కురియడంతో జనజీవనం స్తంభించింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఆఫీస్, పాత తహసీల్ ఆఫీస్ మధ్య రోడ్డుపై చెట్టు నేల కూలింది. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ ఆటోను కూలుతున్న చెట్టు తాకడంతో ఆటోలో ఉన్న ముగురికి గాయాలయ్యాయి. వీరిని వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

పెంబిలో..

పెంబి: మండలంలో సోమవారం రాత్రి దాదాపు అరగంట సేపు గాలి వానతో బీభత్సం సృష్టించాయి. పెంబి నుంచి సత్తన్నపెల్లి మార్గంలో దాదాపు పది చోట్ల చెట్లు రోడ్డుపై విరిగి ప డడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పెంబి సమీపంలోని రహదారిపై ఆటోపై చెట్టుకొమ్మ పడి ఆటో ధ్వంసమైంది. నాగపూర్ సమీపంలో రహదారిపై చెట్టు పడడంతో దాదాపు గంట సేపు వాహనాలు ఆగడంతో నాగపూర్ తాజా మాజీ సర్పంచ్ బోసు శ్రీనివాస్‌కు సమాచారం అందించడంతో వెంటనే వచ్చి చెట్టును తొలగించారు. దీంతో పలువురు శ్రీనివాస్‌ను అభినందించారు.

తాంసికేలో పిడుగు పాటు

భీంపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాంసి(కె)లోని మాజీ సర్పంచ్ వైద్య రవీందర్ ఇంటి ముందరి రేకుల షెడ్‌పై సోమవారం రాత్రి గాలి వానకు పిడుగు పడింది. ఆ సమయంలో మరో గదిలో కుటుంబీకులు ఉండటంతో ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. కాగా మండలం అంతట గాలివాన కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయించి గ్రామాలు అంధకారంలో ఉన్నాయి.



గాలివాన బీభత్సానికి నిర్మల్‌లో కోర్టు వద్ద విరిగి పడ్డ చెట్టు



నిర్మల్‌లో గాలి వాన బీభత్సానికి ఆటోపై విరిగి పడ్డ చెట్టు



రోడ్డుపై చెట్టును తొలగిస్తున్న తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్





బోరు బావుల కింద పసుపు వేస్తున్న రైతులు



పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీ బిజీ

● దుక్కులు చేస్తూ.. ● విత్తనాలు వేస్తూ..

దిలావర్‌పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మృగశిర కార్తె రానే వచ్చింది. ఖరీఫ్ సాగుకు భూములను సిద్ధం చేసుకోవాల్సిన సమయం.. రైతులు వ్యవసాయ పనుల్లో మునిగిపోయారు. నువ్వా నేనా అన్న రీతిలో పనుల్లో పోటీ పడుతున్నారు. కొందరు రైతులు దుక్కులు చేస్తూ భూమిని చదును చేస్తున్నారు. మరికొందరు మృగశిర కార్తెకు ముందే విత్తనాలు వేసేస్తున్నారు. వరి రైతులను మించి నప్పటికి ముందస్తు వర్షాలు భూములను సాగుకు సిద్ధం చేసుకోవడానికి ఒక విధంగా మంచే చేశాయి.

ముందుగా వచ్చిన వర్షం.. ముమ్మరమైన పనులు

ఈ ఏడాది మృగశిర కార్తెకు ముందే వర్షం కుర వడంతో రైతులు అలర్ట్ అయ్యారు. అప్పటికే కొందరు రైతులు వేసవిలోనే భూముల్లో దుక్కులు చేసి సిద్ధం చేయగా, మరికొంత మంది దుక్కులు చేయలేక వర్షం కోసం ఎదురు చూశారు. వారు అనుకున్నట్లుగానే సరైన సమ యంలో వర్షం పడటంతో భూములు దుక్కులకు అను కూలంగా మారాయి. దీంతో రైతులు అరకలు (నాగళ్లు), ట్రాక్టర్ల ప్లవ్, కల్టివేటర్‌లతో దుక్కులు చేస్తున్నారు. గుంటుక, ట్రాక్టర్ రూటవేటర్‌లతో భూములను చదును చేస్తూ విత్తనాలు నాటేందుకు భూములను సిద్ధం చేస్తున్నారు.

బోరుబావుల కింద సాగు షురూ..

మండలంలో బోరుబావులు ఉన్న రైతులు ఇప్పటికే విత్తనాలు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. పసుపు, పత్తి విత్తనాలు వేస్తూ సాగు షురూ చేశారు. మిగతా వర్షాధారంగా సాగు చేసే రైతులు మాత్రం వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. భూములు సిద్ధంగా ఉన్నప్పటికీ ఇప్పుడే వేస్తే వర్షాలు పడటం ఆలస్యమైతే అసలుకే మోసమవుతుందని విత్తనాలు మొలకెత్తక నష్ట పోతామేమోనన్న భయం వారిని వెంటాడుతోంది. వర్షాలు వర్షం కురిసే వరకు ఆగడమే మేలన్న అభిప్రాయంతో ఉన్నారు.

ఈ యేడాది 16,474 ఎకరాల్లో సాగు..

ఈ యేడాది ఖరీఫ్‌లో సుమారు 16,474 ఎకరాల్లో రైతులు సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేసి అందుకు తగిన ప్రణాళికలు రూపొందించారు. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నారు. కాగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచడంతో రైతులు పత్తి, సన్నరకం వరి ధాన్యం సాగువైపు మొగ్గు చూపే అవకాశం ఉందంటున్నారు. మండలంలో పత్తి 5600ల ఎకరాల్లో, వరి ధాన్యం 6,234, మొక్కజొన్న 1,400, సోయాబీన్ 1,120, కంది 160, పసుపు 360, ఇతర పంటలు 1,600ల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు.



నాగలితో దుక్కి చేస్తున్న రైతు





తుక్కును ఏరుతున్న మహిళలు



పత్తికి నీరు ఇచ్చేందుకు డ్రిప్‌లు పరుస్తున్న రైతులు



నాటిన పత్తికి నీరు పెడుతున్న రైతు



తుక్కుకు నిప్పు పెడుతున్నరైతు

పోటాపోటీగా బడి బాట కార్యక్రమం

● ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల మధ్య విద్యార్థుల చేరికపై ఉత్కంఠ

నర్సాపూర్(జి), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సర ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమం పోటాపోటీగా జరిగింది. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఒకవైపు, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు మరోవైపు విద్యార్థుల తల్లిదండ్రులను తమ పాఠశాలల్లో చేర్చుకోవడానికి విస్తృత ప్రచారం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రావు నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు నవీన్, సుజాత, పద్మలత, రవీందర్, తిరుమల్ రెడ్డిలు గ్రామ వీధుల్లో కలియ తిరిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు, ఆంగ్ల మధ్యమంలో విద్యాబోధన వంటి ప్రభుత్వ పథకాలను తల్లి దండ్రులకు వివరించారు. అర్హత కలిగిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్ర భుత్వం కల్పిస్తున్న అవకాశాలను వారు ప్రధానంగా హైలెట్ చేశారు. అదే సమయంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా తమ వం తు ప్రయ త్నంగా గ్రామ ప్రజలను కలిశారు. ముఖ్యంగా తమ పాఠశాలల్లో ప్రాథ మిక తరగతి నుంచే ఆంగ్ల మాధ్య మంలో విద్యాబోధన అందు బాటులో ఉందని, ఆధునిక బోధన పద్ధతులు, అదనపు పాఠ్యేతర కార్యకలాపాలు, వ్యక్తిగత శ్రద్ధ వంటి అంశాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిం చారు. నాణ్యమైన విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ పోటా పోటీ ప్రచారంతో గ్రామస్థులలో తీవ్ర ఆసక్తి నెల కొంది. గత కొన్నేళ్లుగా ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్న తల్లి దండ్రులు ఈ సారి ప్రభుత్వ పాఠ శాలలు ఎంత మేరకు విద్యార్థులను ఆకర్షిస్తాయో చూడాలని మండల వాసులు అంటున్నారు. ము ఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడం, విద్యా ప్రమాణాలను మెరుగు పరచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ సారి విద్యార్థుల చేరికపై ఎంత ప్రభావం చూపుతాయో వేచి చూడాలి. వచ్చే సోమవారం నుంచి పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్న నేపథ్యంలో విద్యార్థుల నమోదు ప్రక్రియ వేగం పుంజు కోనుంది. ప్రభుత్వ పాఠశాలలు తమ లక్ష్యాలను చేరుకుంటాయా లేక ప్రైవేట్ పాఠశాలలు తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తాయా అనేది మరో కొన్ని రోజుల్లో స్పష్టం కానుంది. ఈ బడి బాట కార్యక్రమం కేవలం విద్యార్థులకు చేరికకే కాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా వ్యవస్థల మధ్య నెల కొన్న పోటీకి అద్దం పడుతోంది.



చాక్‌పల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు దృశ్యం

ఆత్మహత్యా యత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

సారంగాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన గట్టు నరేష్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడుతున్నాడని 100కు కుటుంబ సభ్యులు సమాచారాన్ని అందించడంతో బ్లూకోర్టు విధి నిర్వహణలో ఉన్నటు వంటి ఇద్దరు కానిస్టేబుల్స్ వెంటనే ఆత్మహత్య యత్నం చేస్తున్న వ్యక్తిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కలిసి ఉండాలని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ జానకిషర్మిల ఎస్సై శ్రీకాంత్‌తో పాటు పోలీసులు మాధవ్, విఠల్‌రెడ్డిలను అభినందించారు.



వరద లెక్కలపై అయోమయం

- ప్రాజెక్టుల్లోకి వచ్చే వరద ప్రవాహంపై గందరగోళం
- ప్రతి ఏటా వర్షాకాలంలో ఆఫీసర్లకు ప్రాణ సంకటం
- వరద ఉధృతిని నిర్ధారించలేకపోతున్న ఆఫీసర్లు
- జిల్లాలోని ప్రాజెక్టులకు ఇక్కట్లు
- గేజింగ్ స్టేషన్‌లు, సెన్సర్లు లేకపోవడమే అసలు సమస్య

నిర్మల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టులకు ప్రతీఏటా వర్షాకాలంలో వచ్చే వరద నీటి ప్రవాహపు లెక్కలు గతి తప్పుతున్నాయని అంటున్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఎంత మేరకు దిగువన గల ప్రాజెక్టుల రిజర్వాయర్‌లోకి వరదనీరు వస్తుందనే విషయంపై స్పష్టత కరువవు తున్న కారణంగా ఆఫీసర్లు ప్రవాహ తీవ్రతతోనే లెక్క కట్టాల్సి వస్తోందని అంటున్నారు. సీడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం) ఓ రకంగా స్థానిక ఇరిగేషన్ అధికారులు మరోరకంగా వరద ప్రవాహపు లెక్కలు చెబుతుండడంతో గందరగోళం నెలకొంటుందని అంటున్నారు. కడెం మినహా స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టుల పరిస్థితి గందరగోళంగా మారిందని అంటున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల్లోకి ఇటీవల భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున ఎగువ నుండి వరద నీరు ప్రవహించింది. అయితే ఈ ప్రాజెక్టుల్లోకి వచ్చిన వరద ప్రవాహపు నీటి లెక్కలపై కూడా స్పష్టత కొరవడిందంటున్నారు. భారీ వర్షాల సమయంలో సంబంధిత ఇంజనీర్లు ప్రాజెక్టుల వద్దనే ఉండి వరద ఉధృతిని ఊహించుకొని దిగువకు నీరును విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టుల ఎగువ భాగాన రెయిన్ గేజ్ స్టేషన్‌లు గాని సెన్సర్లు గాని లేకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. అయితే కడెం ప్రాజెక్టు ఎగువ భాగాన మత్రం రెయిన్ గేజ్‌స్టేషన్‌లు ఉన్నప్పటికీ ఈ స్టేషన్లు కడెం ప్రాజెక్టుకు అనుసంధానం చేయకపోవడంతో కురిసిన వర్షం లెక్కలకు అనుగుణంగా ఎంత మేర వరద ప్రాజెక్టులోకి వస్తుందో నని సమచారం తెలుసుకోవడం కష్టంగా మారుతుందని అంటున్నారు. గత రెండేళ్ల క్రితం వరద సమయంలో ప్రాజెక్టులోకి ఆరు లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేయగా సెంట్రల్ వాటర్ కమిషన్ మాత్రం నాలుగు లక్షల 94 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చిందని చెబుతుండడంతో నీటిలెక్కలపై స్పష్టత కరువవుతోందంటున్నారు. అయితే ఈ ప్రాజెక్టులో ఎంత మేర పూడిక చేరుకుందోననే అంశంపై ఇప్పటికీ స్పష్టత లేదంటున్నారు. దీని కారణంగానే ఒక్కో ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం, కనిష్ట నీటిమట్టాల మధ్య పూడిక కారణంగా తేడా వస్తుందంటున్నారు. ఈ తేడానే అసలు సమస్యకు కారణమవుతుందంటున్నారు. ఎగువ నుంచి వరదను లెక్కలోకి తీసుకోకుండా దిగువకు రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురవుతుండడమే కాకుండా రిజర్వాయర్‌లలోని విలువైన నీరు కూడా వృధాగా గోదావరి పాలవుతోందంటున్నారు. పూడిక కారణంగా నీటి మట్టాల లెక్కలు సక్రమంగా తెలియక కాలువలకు నీటి విడుదల విషయంలో కూడా సమతుల్యత లోపిస్తుందన్న వాదనలున్నాయి. ఎగువ నుండి ఒకేసారి వరద ప్రవాహం ఎంత మేరకు వస్తుందో తెలియక ఒకేసారి ప్రాజెక్టు గేట్లు ఎత్తి వేయడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్న సంఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. గతంలో నిర్మల్ పట్టణంలోని జీఎన్‌ఆర్ కాలనీ కూడా ఇలాగే నీట మునిగిన సంగతి తెలిసిందే, స్వర్ణ ప్రాజెక్టుకు వరద పోటు తీవ్రమవడంతో ప్రవాహ ఉధృతి తెలియక ఒక్కసారి ఆ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వేశారు. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అలాగే కడెం, గడ్డెన్న వాగు ప్రాజెక్టులో కూడా ఇలాగే వరద ప్రవాహం పెరగడంతో ఒకేసారి గేట్ల నుండి నీటిని విడుదల చేశారు. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో దాదాపు 5 కోట్ల రూపాయల విలువైన విద్యుత్ స్తంభాలు, టవర్లు నేలమట్టమయ్యాయి.


గడ్డెన్న వాగు రిజర్వాయర్ దృశ్యం

గేజింగ్ స్టేషన్‌లతో లింకేజీ లోపం...

స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టుల ఎగువ భాగాన రెయిన్ గేజింగ్‌స్టేషన్‌లు లేకపోవడంతో వరద ఉధృతి తెలియడం లేదంటున్నారు. దీంతో రెండు ప్రాజెక్టులు రిజర్వాయర్‌లోకి ఎంత మేరకు వరద వస్తుందోనని విషయం తెలుసుకునేందుకు ఇంజనీరింగ్ అధికారులు నానా తంటాలు పడుతున్నారు. వరద తీవ్రతను తెలుసుకోవడంలో ఆలస్యం జరిగితే లోతట్టు ప్రాంతాలకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. దీతో పాటు కడెం ప్రాజెక్టుకు సంబంధించి ఎగువ భాగాన గేజింగ్ స్టేషన్‌లు ఉన్నప్పటికీ ఆ గేజింగ్ స్టేషన్‌లలో ఈ ప్రాజెక్టుకు అనుసంధానం లేకపోవడం సమస్యకు కారణమవుతోంది. ఎగువన గేజింగ్‌స్టేషన్‌లు ఉండడంతో వర్షాపాతంతో పాటు వరద ఉధృతిని కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇక్కడి ప్రాజెక్టుకు గేజింగ్‌స్టేషన్లతో అనుసంధానం లేని కారణంగా వరద ఉధృతిని తెలుసుకోవడం కష్టంగా మారింది. ఇందులో భాగంగానే గత వరదల సమయంలో నీటిప్రవాహ ఉధృతిని తెలుసుకోవడం అధికారులకు ఇబ్బందికరమైంది. అర్ధరాత్రి వరకు కడెం ప్రాజెక్టులోకి వరద ఎంత మేరకు వస్తుందోననే విషయం తెలియక అటు అధికారులు ఇటు లోతట్టు ప్రాంతాల ప్రజలంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికైనా ఎగువ గల గేజింగ్‌స్టేషన్‌లను కడెం ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని అలాగే స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టుపై సెన్సార్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

67 టీఎంసీల కడెం వరద నీరు గోదావరి పాలు

గత రెండేళ్ల క్రితం కడెం ప్రాజెక్టులోకి ప్రవహించిన వరద నీరంతా భారీగా గోదావరి పాలయ్యింది. ప్రాజెక్టులోకి మొత్తం 72 టీఎంసీలకు పైగా వరద నీరు ప్రవహించినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా 67 టీఎంసీలకు పైగా నీరును గోదావరిలోకి వదిలి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కడెం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 7.27 టీఎంసీలు కాగా దీనికి పదింతల నీరంతా గోదావరి పాలయ్యింది. అలాగే స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులకు వచ్చిన వరదనీరు కూడా వేల క్యూసెక్కులలో దిగువకు వృధాగా విడుదల చేశారు. ప్రతి ఏటా ఇలా వరద నీరు భారీగా గోదావరి పాలవుతున్నప్పటికీ గత వర్షాకాలంలో పదింతలు ఎక్కువగా నీరును గోదావరిలోకి వదిలిపెట్టారు. అయితే ఈ లెక్కలపై కూడా ఇప్పటికీ స్పష్టత లేదని అధికారులు పేర్కొంటున్నారు.


గడ్డెన్న వాగు ప్రాజెక్టు ముందుభాగం

జొన్నల డబ్బుల విడుదలకు

వ్యవసాయ మంత్రి హామీ ఇచ్చారు

నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి భీమ్‌రెడ్డి



నిర్మల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం కొనుగోలు చేసిన జొన్నపంటకు సంబంధించి డబ్బులను బుధవారం నుంచి రైతులందరికీ ప్రభుత్వం చెల్లించనుందని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి భీమ్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ మేరకు మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, డీసీసీ ప్రెసిడెంట్ శ్రీహరిరావులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి జొన్నల డబ్బుల చెల్లింపు సమస్యను వివరించారన్నారు. వీరిద్దరి వినతి మేరకు వెంటనే స్పందించిన మంత్రి నిధుల చెల్లింపుకు హామీ ఇవ్వడమే కాకుండా బుధవారం నుంచి రైతుల ఖాతాల్లో ఈ డబ్బులు జమ చేయనున్నట్లు వెల్లడించారన్నారు. స్పందించిన డబ్బుల విడుదలకు ఆదేశించారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారికి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావులకు భీమ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నూతన మంత్రులను కలిసిన డీసీసీ అధ్యక్షుడు


మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నూతన మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి.వినోద్, వాకాటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లను డీసీసీ అధ్యక్షులు కే.శ్రీహరిరావు సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మల్ నుంచి అరుణాచలం రామేశ్వరానికి బస్సు

నిర్మల్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నుంచి రామేశ్వరానికి సూపర్‌లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే.పండరి తెలిపారు. నిర్మల్ నుంచి అరుణాచలం, పలని, మధురై, పాతాళ శంబు, రామేశ్వరం, ధనుష్కోడి యాత్రలకు బస్సు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. రామేశ్వరం వరకు బస్సు వెళ్లి తిరిగి అరుణాచలం గిరి ప్రదక్షిణ దర్శనం చేయించుకుని నిర్మల్ చేరుకుంటుందని ఆయన తెలిపారు. ప్రయాణపు తేదీ, ఛార్జ్ వివరాలకు 9959226003, 8328021517, 7382842582 సంప్రదించాలని తెలిపారు. అలాగే 36 మంది ప్రయాణికులు ఉంటే ఎక్కడికైనా బస్సు సౌకర్యం కల్పిస్తామని డిపో మేనేజర్ తెలిపారు.

కవులు, కళాకారులకు సన్మానం

నిర్మల్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వెన్నెల డాన్స్ అకాడమీ వార్షికోత్సవం వేసవి కాల నృత్య శిక్షణ శిబిర ముగింపు కార్యక్రమంలో భాగంగా నృత్యకారులను, కవులను, కళాకారులను సన్మానించినట్లు డైరెక్టర్ ధనరాజ్ తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ... గత 18 సంవత్సరాలుగా వెన్నెల డాన్స్ అకాడమీ చేస్తున్న సాహితీ సాంస్కృతిక కళ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కవులు పత్తి శివప్రసాద్, నేరెళ్ల హనుమంతు, పోలీస్ భీమేష్‌లను ఘనంగా సన్మానించారు.

యూనిఫారంల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్కకు వివరించిన కలెక్టర్ అభిలాష అభినవ్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాఠశాలలు ప్రారంభానికి ముందే 48,874 మంది విద్యార్థులకు యూనిఫారంలు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అబిలాష అభినవ్ మంత్రి సీతక్కకు వివరించారు. సోమవారం కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అనంతపేట గ్రామంలో ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు కార్యాచరణ ప్రారంభించామన్నారు. స్వయం సహాయక సంఘాల్లో కొత్త సభ్యుల చేర్పు తదితర అంశాలు మంత్రికి తెలియజేశారు. మంత్రి సీతక్క సీఎస్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో సోలార్ ప్లాంట్లు, పెట్రోల్‌బంక్‌ల ఏర్పాట్లు అక్టోబరు 2న ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ మహిళా శక్తి భవనాలు నవంబరు లోగా పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్‌కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, డీఈవో రామారావు, డీఆర్డీవో విజయలక్ష్మి, తదితర అధికారులు హాజరయ్యారు.

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించండి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తులో పేర్కొన్న అంశాన్ని సమగ్రంగా పరిశీలించి, వాస్తవ స్థితిగతులను పరిగణలోకి తీసుకొని తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శానిటేషన్ చర్యలు నిర్లక్ష్యం కాకుండా నిర్వహించాలని సూచించారు. స్కూళ్లు, హాస్టళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాలో ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష చేసి, పనుల్లో వేగం తీసుకురావాలని సూచించారు. ప్రజల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్క శాఖ సమన్వయంతో పని చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని కలెక్టర్‌కి వినతి

నిర్మల్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరైన ఇంతవరకు అధికారులు అలాట్మెంట్ చేయడం లేదని కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం ఇచ్చినట్లు రాంనగర్ కాలనీ వాసులు తెలిపారు. వారు మాట్లాడుతూ... పట్టణంలోని రాంనగర్ వార్డు నెంబర్ 16 కాలనీకి చెందిన మాకు రెండు సంవత్సరాల క్రితం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరై అలాట్మెంట్ చేసి నెంబర్లు కూడా ఇచ్చారు. కానీ ఇంతవరకు మాకు ఎలాంటి ఇళ్లను చూపించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో లావణ్య, సుజాత, సావిత్రి, నర్మదా, సమత, తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో జొన్న కొనుగోళ్ల చెల్లింపులు


ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్‌తో పంచాయతీరాజ్ శాఖాధికారుల సమావేశం

భైంసా, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ పరిధిలో ప్రభుత్వ రంగ సంస్థల జరిగిన జొన్న కొనుగోళ్లకు సంబంధించిన డబ్బుల చెల్లింపులు వారం రోజుల వ్యవధిలో జరుగనున్నాయని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ తెలిపారు. సోమవారం సంబంధిత విషయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్, మార్కెటింగ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడినట్లుగా పేర్కొన్నారు. వానాకాలపు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతన్నల సాగు పెట్టుబడి కోసం గాను డబ్బులు అవసరం ఉన్న దృష్ట్యా జొన్నల కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపులు చేపట్టాలని వారి ఇరువురి దృష్టికి తీసుకెళ్లినట్లుగా పేర్కొన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్ వారం రోజుల వ్యవధిలో రైతన్నల బ్యాంక్ ఖాతాలలో జొన్నల కొనుగోళ్లకు సంబంధించిన డబ్బులు చెల్లింపులు చేయనున్నట్లుగా వివరించినట్లు తెలిపారు.

- రోడ్ల తాత్కాలిక మరమ్మతులను సత్వరమే చేపట్టాలి

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రోడ్లకు అవసరమైన తాత్కలిక మరమ్మతులను సత్వరమే చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ ఆదేశించారు. సోమవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో డివిజన్ పరిధిలో పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సీజన్‌లో వర్షాలు అధికంగా కురియనున్న దృష్ట్యా ముందస్తుగా మరమ్మతు చర్యలు చేపట్టాలన్నారు. నివేదికలను ప్రభుత్వానికి అందజేసి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని పేర్కొన్నారు. వర్షాకాలం పూర్తయ్యేంత వరకు పంచాయతీరాజ్ అధికారులందరూ అన్నివేళలా అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

గురువులకు ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ వద్ద నవీన్ గోల్డ్ కన్వెన్షన్ నందు 1986-2025 ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 39 సంవత్సరాల తర్వాత డాక్టర్లు సిబ్బంది కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్లకు పూల వర్షంతో అపూర్వ స్వాగతం పలికినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్ చంద్ర హరి, డాక్టర్ చక్రధారి, డాక్టర్ దామెర రాములు, డాక్టర్ వెంకట్రావు, హనుమంతు, ల్యాబ్ టెక్నీషియన్ గణపతి రెడ్డి, పూసాల పోశెట్టి, అజారుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


మృతి చెందిన దేశ్‌ముఖ్ చంద్రకాంత్

భైంసా, జూన్, 9 : (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివాజీ చౌక్ ప్రాంతంలో గల జిన్నింగ్‌మిల్లులో సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో అదే ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఒకరు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానిక రాహుల్‌నగర్ కాలనీకి చెందిన దేశ్‌ముఖ్ చంద్రకాంత్ (44) గత రెండున్నర దశాబ్దాలకు పైగా కాలం నుంచి సంబంధిత ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇందులో భాగంగానే సోమవారం ఫ్యాక్టరీ ఆవరణలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం తగిలి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు ప్రమాదఘటనపై విచారణ జరుపుతున్నారు.

నిర్లక్ష్యంగా

లారీ ఆపడంతో రోడ్డు ప్రమాదం

- దంపతులకు గాయాలు, కేసు నమోదు

నర్సాపూర్(జి), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : దిలావర్‌పూర్ మండలంలోని లోలం గ్రామానికి చెందిన తోపారం బుచ్చన్న(45) అనతి భార్య కళావతి(42) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. శనివారం లోకేశ్వరం మండలంలోని పంచగుడి గ్రామంలోని తమ చెల్లెలి గృహ ప్రవేశ కార్యక్రమానికి వెళ్లి, ఆదివారం తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం సమయంలో నందన్ ఎక్స్ రోడ్ వద్దకు చేరుకోగానే మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహేష్ అనే లారీ డ్రైవర్ తన లారీని ఎలాంటి సూచనలు, ఇండికేటర్లు వేయకుండా జాతీయ రహదారి ఎన్‌హెచ్ 61పై నిర్లక్ష్యంగా ఆపాడు. దీంతో పంచగుడి నుంచి లోలం వైపు తన మోటార్ సైకిల్‌పై వస్తున్న బుచ్చన్న లారీని వెనుక నుండి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బుచ్చన్నకు రెండు చేతులకు, నుదుటికి తీవ్ర గాయాలయ్యాయి. అతని భార్య కళావతికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం బాధితురాలు నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిర్లక్ష్యంగా లారీని ఆపిన డ్రైవర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని బుచ్చన్న కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ ఘటనలో జాతీయ రహదారులపై డ్రైవర్ల నిర్లక్ష్యం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

పాఠశాల భవనాలను

పరిశీలించిన ఆర్ అండ్ బి ఏఈ

లోకేశ్వరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిలోలి, పోట్‌పల్లి(బి), బాగాపూర్, లోకేశ్వరం, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల కనకాపూర్, వటోలి, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పంచగుడి, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పిప్రిలో గల ఏవైతే కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలను ఆర్ అండ్ బీ ఏఈ విశాల్, మండల విద్యాధికారి బి.చంద్రకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరితో పాటు వివిధ కాంప్లెక్స్‌ల సీఆర్‌పీలు సునీత, ప్రవళిక, వసంత లక్ష్మి, తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పాఠశాలలో పరిశీలించిన భవనాల సంబంధించిన రిపోర్టులను పై అధికారులకు అందిస్తామన్నారు.